క్లుప్తంగా

బహిరంగ సభకు తరలిరండి



జడ్చర్ల టౌన్: భూత్పూర్ సమీపంలో అక్టోబర్ 1న నిర్వహించే ప్రధానమంత్రి బహిరంగ సభకు తరలిరావాలని, జయప్రదం చేద్దామని బీజేపీ పార్లమెంట్ ఇన్‌చార్జ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. సోమవారం నియోజకవర్గ కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నాయకులు ముచ్చర్ల కృష్ణయ్య, సీతారాం జవహర్, బాల త్రిపురసుందరి దేవి, కుమ్మరిరాజు, రమేష్‌జీ, సామల నాగరాజులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

అడ్డాకుల: మండలంలోని గుడిబండ గ్రామానికి చెందిన రాజమ్మ అనారోగ్యానికి గురై మృతిచెందగా బాధిత కుటుంబాన్ని సోమవారం బీఆర్‌ఎస్ నాయకులు పరామర్శించారు. జెడ్పీటీసీ రాజశేఖర్‌రెడ్డి పంపించిన రూ.5వేలను బాధిత కుటుంబానికి అందజేశారు. సర్పంచ్ భాస్కర్‌నాయుడు, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులు, లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.

మహాధర్నా జయప్రదం చేద్దాం



జడ్చర్ల టౌన్: పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ అక్టోబర్ 3న తలపెట్టిన మహాధర్నాను జయప్రదం చేద్దామని మున్సిపల్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ పిలుపునిచ్చారు. సోమవారం కార్మికులను కలుసుకుని మాట్లాడారు. పట్టణ కమిటీ కోశాధికారి విజయ్, కార్యనిర్వహణ కార్యదర్శి కృష్ణ, ఉపాధ్యక్షుడు కేశవులు, నాయకులు యాదమ్మ, బాల్ వెంకట్, శివలీల, కార్మికులు పాల్గొన్నారు. అనంతరం హైదరాబాద్ సీఎండీ కార్యాలయానికి రాష్ట్ర శాఖ వెంట తరలివెళ్లి మహాధర్నా నోటీసును అందజేశారు.

ఓటింగ్‌పై అవగాహన

చిన్నచింతకుంట: అల్లీపురంలో ఎన్నికల అధికారి రాజేష్‌ఖన్న సోమవారం ఓటింగ్ విధానంపై అవగాహన కల్పించారు. ఈవీఎంలు, వీవీప్యాట్ల విషయంలో ఓటర్లు ఎలాంటి అపోహకు గురి కావద్దని సూచించారు.



నిరవధిక సమ్మెలో ఆశావర్కర్లు

రాజాపూర్: కనీసవేతనం రూ.18 వేలు ఇవ్వాలని.. ఇతర సౌకర్యాలు కల్పించాలని మండల కేంద్రంలో సోమవారం ఆశావర్కర్లకు నిరవధిక సమ్మెకు దిగారు. సమ్మెకు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దీప్లా నాయక్ మద్దతు తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, రూ. 5 లక్షల బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్లు మాధవి, అమృత, యాదమ్మ, విమల తదితరులు పాల్గొన్నారు.

బాలానగర్: మండలకేంద్రంలో సోమవారం ఆశా కార్యకర్తలు సమ్మె చేపట్టారు. సమ్మెకు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దీప్లానాయక్ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకురాలు సావిత్రి, అమృత, యాదమ్మ, వినీల, జంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

జడ్చర్ల: ఆశా వర్కర్ల సమస్యలను ప్రభుత్వం వెంటే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సత్తయ్య డిమాండ్ చేశారు. సోమవారం చేపట్టిన సమ్మెలో మాట్లాడారు. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని అన్నారు. సంఘం నాయకులు శివలీల, నర్సమ్మ, జయలక్ష్మి పాల్గొన్నారు.

నవాబుపేట: మండల కేంద్రంలో చేపట్టిన సమ్మెలో ఆశా కార్యకర్తలు నిర్మల, అంజమ్మ, పద్మ తదితరులు పాల్గొన్నారు.



బాలానగర్‌లో సమ్మెలో పాల్గొన్న ఆశావర్కర్లు



జడ్చర్లలో ..



నవాబుపేటలో..

బలవంతంగా బిల్లులు వసూలు చేయొద్దు

అడ్డాకుల: దళితుల నుంచి కరెంటు బిల్లులను బలవంతంగా వసూలు చేయొద్దని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి కురుమూర్తి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద సోమవారం కేవీపీఎస్ ఆధ్వర్యంలో దళితులు ధర్నా నిర్వహించారు. 101 యూనిట్ల నుంచి 300 యూనిట్ల వరకు ఉచిత కరెంటును ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేరళ, తమిళనాడు, ఢిల్లీ, ఆంధ్రప్రదేశ్‌లో 300 యూనిట్ల కరెంటు అమలవుతుందని చెప్పారు. వెబ్‌సైట్లో పేర్లు నమోదైన వారి నుంచి కూడా విద్యుత్ అధికారులు బలవంతంగా బిల్లులు వసూలు చేయడం ఆపాలని కోరారు. అనంతరం విద్యుత్ ఏఈకి వినతిపత్రం అందజేశారు. అంతకు ముందు బస్టాండ్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బాలరాజు, ప్రసాద్, జీవరత్నం, రమేష్, రామన్న, చంద్రకాంత్, శ్రీకాంత్, దేవదాస్, కృష్ణ, ప్రకాష్, అంజనేయులు తదితరులు ఉన్నారు.



అడ్డాకులలో ఏఈకి వినతిపత్రం అందజేస్తున్న కేవీపీఎస్ నాయకులు

హన్వాడ: ప్రభుత్వం 342జీఓ ప్రకారం ఎస్సీఎస్టీలకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేయాలని సోమవారం మండలకేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట కేవీపీఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. విద్యుత్ అధికారికి వినతిపత్రం సమర్పించారు. నాయకులు రాములు, బాలయ్య, ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులతో ప్రభుత్వం చెలగాటం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరికి నిరుద్యోగులు బలి కావాల్సి వచ్చిందని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు రుక్‌మోద్దీన్ అన్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. కేసీఆర్ ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తూ నిరుద్యోగుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం ఆడుతోందన్నారు. గ్రూప్ 1 రెండోసారి రద్దు కావడం ముమ్మాటికీ కేసీఆర్ వైఫల్యమేనన్నారు. జిల్లా ఇన్‌చార్జ్ కృష్ణయ్య, రామచంద్రయ్య, శివకుమార్, బసిరెడ్డి పాల్గొన్నారు.



ధర్నాలో పాల్గొన్న నాయకులు

2200 పనులు 10 రోజుల్లో పరిశీలన

నవాబుపేట: మండలంలో ఉపాధిహామీ పథకంలో రెండు సంవత్సరాల్లో 2200 పనులు పూర్తి చేసి కూలీలకు రూ.12 కోట్ల 45 లక్షలు చెల్లించినట్లు ఎంపీడీఓ శ్రీలత తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం సామాజిక తనిఖీ బృందాలతో కార్యక్రమం చేపట్టారు. మొత్తం పనులు 10 రోజుల్లో క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి రిపోర్టు సిద్ధం చేయాల్సి ఉందన్నారు. వచ్చే నెల మొదటి వారంలో మండలస్థాయి బహిరంగ చర్చ వేదిక ఉంటుందని వివరించారు. ఏపీఓ జ్యోతి తదితర సిబ్బంది ఉన్నారు.



వివరాలు చెపుతున్న ఎంపీడీఓ

పేదింటి ఆడబిడ్డకు ఆపన్నహస్తం

హన్వాడ: పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు కల్యాణలక్ష్మి ఆపన్నహస్తమని మంత్రి శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. సోమవారం మండలకేంద్రంలో మొత్తం 84 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. గతంలో ఆడబిడ్డ పెళ్లి చేయాలంటే అప్పుచేయాల్సిన దుస్థితి ఉండేదని.. ప్రస్తుతం పరిస్థితి మారిందన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం కేసీఆర్ పేదల పేదలకు అండగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. జిల్లాకేంద్రం నుంచి హన్వాడ, కోస్గిల మీదుగా చించోలి జాతీయ రహదారి పనులు వేగంగా సాగుతున్నాయని పేర్కొన్నారు. గొండ్యాల్‌లో రూ.10కోట్లతో బీటీరోడ్డును వేస్తున్నామని వివరించారు. మహిళలతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఎంపీపీ బాల్‌రాజు, జెడ్పీటీసీ విజయ నిర్మల, వైస్‌ఎంపీపీ లక్ష్మి, మండల అధ్యక్షుడు కరుణాకర్‌గౌడ్, ఎంపీడీఓ ధనుంజయగౌడ్, తహసీల్దార్ కిష్టునాయక్ పాల్గొన్నారు.



చెక్కులను పంపిణీ చేస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

బ్రోచర్ల ఆవిష్కరణ

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలో వచ్చేనెల 1న ఆర్‌కే స్పోర్ట్స్ కరాటే మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మినిస్టర్ కప్ చాంపియన్‌షిప్ బ్రోచర్లను సోమవారం మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆవిష్కరించారు. అకాడమీ ఫౌండర్ కె.రవికుమార్ వివిధ జిల్లాల నుంచి 500 మంది విద్యార్థులు హాజరవుతున్నట్లు తెలిపారు. జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షుడు గోపాల్ యాదవ్, అకాడమీ సలహాదారులు ఎంఎస్.విజయ్‌కుమార్, ఉపాధ్యక్షులు ప్రశాంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): హన్వాడ మండలం వేపూర్ గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు సోమవారం స్థానిక ఫాం హౌస్‌లో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు.

సేవలకు పురస్కారం

మహబూబ్‌నగర్ రూరల్: రాష్ట్ర ఆరెకటిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం మహబూబ్‌నగర్‌లో సమాజంలో వివిధ సేవలు అందించినందుకుగానూ సభ్యులకు పురస్కారం అందజేసి సన్మానించారు. జమాల్‌పూర్ నాగరాజు, మాజీ కౌన్సిలర్ వినయ్‌కుమార్, వెంకటేష్, శంకర్, రామచందర్ పురస్కారాలు అందుకున్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుష్పరాజ్, రాష్ట్ర కోశాధికారి లాలాజీ రవీంద్రనాథ్, జిల్లా అధ్యక్షుడు ఎన్.ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి విజయభాస్కర్, నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లకు పరిహారం అందించాలి



మహమ్మదాబాద్: రోడ్డు వెడల్పులో భాగంగా మహమ్మదాబాద్ మండల కేంద్రంలో కూల్చుతున్న ఇళ్లకు, దుకాణాలకు పరిహారం అందించాలని బాధితులు కోరారు. ఈ మేరకు తహసీల్దార్ ఫిర్యాదు చేశారు. రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఆయా దుకాణాల యజమానులు పాల్గొన్నారు.

మాతాశిశు రక్షణకు చర్యలు

మహబూబ్‌నగర్ రూరల్: మాతాశిశు సంరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని, పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని సీడీపీఓ కె.రాజేశ్వరి అన్నారు. సోమవారం మహబూబ్‌నగర్ పట్టణంలోని బండ్లగేరి సెక్టార్ పరిధిలో పోషణ మాసోత్సవాలను పురస్కరించుకుని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు సమతుల్యమైన ఆహారాన్ని అందించినప్పుడే ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చన్నారు. సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేందుకు ప్రతిఒక్కరూ పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవాలని అన్నారు. రక్తహీనత పెరగకుండా ఇది తోడ్పడుతుందన్నారు. అదేవిధంగా పోషకాహార లేమితో ఇబ్బందులు పడుతున్న చిన్నారులను గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆహార పదార్థాలను ప్రదర్శించారు. చిన్నారులతో అన్నప్రాసనం చేయించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వసీమ్ సుల్తానా, అంగన్‌వాడీ టీచర్లు శ్రీదేవి, రాజప్రమీల, కల్పన, విజయ పాల్గొన్నారు.



ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న సీడీపీఓ రాజేశ్వరి

ప్రతి గ్రామంలో అమరుల స్మారకాలు

పాలమూరు: దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన అమరవీరులను గుర్తించడం కోసం దేశవ్యాప్తంగా మేరీ మట్టి- మేరా దేశ్ కార్యక్రమాన్ని ప్రధాని మోదీ ప్రారంభించారని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఏపీ జితేందర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని న్యూగంజ్ నీలకంఠ మల్లికార్జున దేవస్థానం సమీపంలో మట్టిని సేకరించే కార్యక్రమం చేపట్టారు. అమరవీరుల జ్ఞాపకార్థం ప్రతి గ్రామంలో స్మారకాలు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. అనంతరం గణనాథుడి దగ్గర ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని జితేందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వీర బ్రహ్మాచారి, నేతలు పడకుల బాలరాజు, కృష్ణవర్ధన్‌రెడ్డి, పాండురంగారెడ్డి, అంజయ్య, హరికృష్ణ పాల్గొన్నారు.



మట్టిని సేకరిస్తున్న నాయకులు

నేటి నుంచి వైద్య శిబిరాలు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణ పరిధిలోని పాతపాలమూరు, రామయ్యబౌలి, కుమ్మరివాడి, మోతీనగర్ యూపీహెచ్‌సీలలో 421మంది పారిశుద్ధ్య కార్మికులకు సఫాయి మిత్ర సురక్షలో భాగంగా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ డి.ప్రదీప్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 28 కొనసాగుతాయని, ప్రతి ఒక్కరూ అవసరమైన చికిత్సలు చేసుకోవాలని ఆయన సూచించారు.

జాతీయ కరాటేలో జిల్లా విద్యార్థి ప్రతిభ

మహబూబ్‌నగర్ క్రీడలు: సిద్దిపేటలో ఆదివారం జరిగిన జాతీయస్థాయి కరాటే పోటీల్లో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థి ఆలియా బేగం ప్రతిభచాటింది. ఈ మేరకు పతకం సాధించారు. కాగా సంబంధిత వివరాలను స్టేట్ స్కూల్ స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, మాస్టర్ ఎతెనె చెన్నయ్య సోమవారం తెలిపారు.

తలసేమియా బాధితులను ఆదుకోవాలి



జడ్చర్ల టౌన్: ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసి తలసేమియా బాధితులను ఆదుకోవాలని మహబూబ్‌నగర్ రెడ్‌క్రాస్ చైర్మన్ నటరాజు పిలుపునిచ్చారు. సోమవారం పోలేపల్లి సెజ్‌లోని శిల్పా మెడికేర్ లిమిటెడ్‌లో నిర్వహించిన రక్తదాన శిబిరం ప్రారంభించి మాట్లాడారు. జిల్లాలో 172 మంది తలసేమియా బాధితులు ఉన్నారని, వారి ఆరోగ్య రక్షణకు తరచుగా రక్తం అవసరమని అన్నారు. శిబిరంలో 96మంది రక్తదానం చేశారు. మేనేజింగ్ డైరెక్టర్ విష్ణుకాంత్ భూతాడ, ఆంజనేయులు, డా. అరుణ, రెడ్‌క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు వెంటనే పరిష్కరించాలి

మిడ్జిల్: అంగన్‌వాడీల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ సహాయ కార్యదర్శి సత్తయ్య డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో సమ్మెచేస్తున్న అంగన్‌వాడీలకు మద్దతు తెలిపారు. అనంతరం ర్యాలీ, మానవహారం చేపట్టారు. కృష్ణయ్య, మైహిముద,లీలావతి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

దేవరకద్ర: నియోజవర్గ కేంద్రంలోని జాతీయ రహదారిపై అంగన్‌వాడీలు సోమవారం మానవహారం చేపట్టి నిరసన తెలిపారు. మండల పరిషత్ కార్యాలయం నుంచి పాత బస్టాండ్, కొత్తబస్టాండ్ మీదుగా రాయిచూర్ రోడ్డులోని ఎస్‌బీఐ వరకు ర్యాలీ నిర్వహించారు. మండల కమిటీ అధ్యక్షురాలు లక్ష్మీ, ఇఫ్టూ జిల్లా కార్యదర్శి సాంబశివుడు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

కాంగ్రెస్‌లో నూతనోత్తేజం

నవాబుపేట: కాంగ్రెస్ నూతనోత్తేజం వచ్చిందని ఇక వచ్చే ఎన్నికలలో గెలుపు తథ్యమని డీసీసీ ప్రధానకార్యదర్శి బంగ్లారవి అన్నారు. సోమవారం మండల అధ్యక్షుడు రాంచంద్రయ్యతో కలిసి దేపల్లి, ఆర్‌సీపూర్, కాకర్‌జాల్, రంగంపల్లి గ్రామాల్లో నూతన కమిటీలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. కాంగ్రెస్ గెలుపును ఎవరూ ఆపలేరన్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు సన్మానించారు. జిల్లా నాయకులు ఖాజా, షబ్బీర్, అజహర్ అలీ, శ్రీహరి సర్పంచ్ వెంకటేష్ పాల్గొన్నారు.

చిన్నచింతకుంట: కాంగ్రెస్‌తోనే సంక్షేమ పథకాలు సాధ్యమవుతాయని పార్టీ ఓబీసీ సెల్ రాష్ట్ర నాయకుడు వేణుగోపాల్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ పేద ప్రజలకోసం ఆరు గ్యారెంటీ పథకాలను ప్రవేశ పెడుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి వస్తుందని పేర్కొన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన ఓబీసీ సెల్ మండల అధ్యక్షుడు కమలాకర్‌ను సన్మానించారు. పార్టీ మండల అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

హామీలు అమలు చేయాలి

బాలానగర్: రేషన్ డీలర్లకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసేలా ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవాలని రాష్ట్ర అధ్యక్షుడు రాజును బాలానగర్ సంఘం నాయకులు కోరారు. మండలానికి వచ్చిన ఆయనను ఘనంగా సత్కరించారు. అధ్యక్షుడు చెన్నారెడ్డి, చంద్రమౌళి, లింగం ఉన్నారు.

ఎంపీడీఓకు వినతి

హన్వాడ: మండలంలోని పారిశుద్ధ్య కార్మికులు సోమవారం ఎంపీడీఓ ధనుంజయగౌడ్‌కు వినతి పత్రం ఇచ్చారు. పంచాయతీ ఉద్యోగ, కార్మికులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని లేని పక్షంలో తాత్కాలికంగా నిలిపిన సమ్మెను మళ్లీ చేపడతామని పేర్కొన్నారు. కార్మికులు బాలకిష్టయ్య, రంగయ్య, రాములు, రంగన్న, వెంకటయ్య, రంగమ్మ, వెంకటమ్మ, పాల్గొన్నారు.

అధ్యాపకులను క్రమబద్ధీకరించాలని నిరసన



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ ముఖద్వారం వద్ద సోమవారం తమను క్రమబద్ధీకరించాలంటూ పలువురు అధ్యాపకులు నిరసన చేపట్టారు. కొన్నేళ్లుగా యూనివర్సిటీలో విధులు నిర్వహిస్తూ ఉద్యోగ భద్రత లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వివరించారు. రవికుమార్, సోమేష్, అర్జున్, సుదర్శన్ రెడ్డి, సురేష్, విజయ్‌భాస్కర్ పాల్గొన్నారు.

గణపయ్యకు ప్రత్యేకపూజలు



జిల్లాకేంద్రంలోని బండమీదిపల్లిలో పూజలందుకున్న గణనాథుడు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): తెలంగాణ చౌరస్తాలో ఏర్పాటు చేసిన గణేశుడికి సోమవారం సీఐ రాజేశ్వర్‌రెడ్డితో పాటు ఇతర సీఐలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. పదిహేను వందల మందికి అన్నదానం చేసినట్లు నిర్వాహకుడు వెంకటరమణ తెలిపారు. కృష్ణ, మల్లేష్, సందీప్, సుదీప్, తిరుపతయ్య, సాయి, రఘు, ప్రశాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

పట్టణ పరిధిలోని బండమీదిపల్లిలో ఛత్రపతి శివాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడికి సోమవారం సాయంత్రం ప్రత్యేకపూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా హోమం

చిన్నచింతకుంట: మండల కేంద్రంలోని 8వ వార్డులో ప్రతిష్ఠించిన వినాయక మండపం వద్ద కాలనీ వాసులు సోమవారం ఘనంగా హోమం నిర్వహించారు. కాలనీవాసులు కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం అన్నదానం చేపట్టారు.



అన్నం వడ్డిస్తున్న సీఐలు

నాటిన మొక్కలను సంరక్షించాలి

దేవరకద్ర: నాటిన మొక్కలను సంరక్షించాలని ఎంపీడీఓ శ్రీనివాసులు అన్నారు. మండల కేంద్రంలోని పెద్ద చెరువు వద్ద సోమవారం ఈత మొక్కలను నాటే కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. చెరువు సమీపంలోని ప్రభుత్వ స్థలంలో, చెరువు కట్ట కింద భాగంలో ఈత మొక్కలను నాటించారు. మొక్కలు పెద్దగా పెరిగే వరకు పర్యవేక్షణ చేయాలని ఉపాధి హామీ ఎఫ్‌ఏలకు సూచించారు. అలాగే పెద్ద చెరువు వద్ద గణేశ్ నిమజ్జనం కోసం జేసీబీతో ముళ్ల చెట్లను తొలగించి రహదారిని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఈవో సీత్యానాయక్ పాల్గొన్నారు.



నేడు ప్రారంభోత్సవాలు

నవాబుపేట: మండలంలో ఎప్పుడు లేని విధంగా ఒకే రోజు దాదాపు రూ.25 కోట్లకు పైగా నిధులతో చేపట్టిన వివిధ పనులకు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ప్రారంభించనున్నారు. హజిలాపూర్ రోడ్డు నుంచి రాంసింగ్‌తండా వరకు, కొల్లూర్ రోడ్డు నుంచి బట్టోనిపల్లి తండావరకు, కొల్లూర్ రోడ్డు నుంచి సత్రోనిపల్లితండా వరకు రోడ్డు పనులు ప్రారంభం కానున్నాయి. అదేవిధంగా కొల్లూర్‌లో నిర్మించిన పంచాయతీ భవనం, జెడ్పీ పాఠశాల అదనపు గదులు, సీసీరోడ్డు పనులు, హెల్త్‌సబ్‌సెంటర్‌ను, యన్మన్‌గండ్లలో హెల్త్‌సబ్‌సెంటర్ ప్రారంభం, రాంసింగ్‌తండా, దయాపంతులపల్లి గ్రామాల్లో పంచాయతీ భవనాలకు భూమిపూజ నిర్వహించనున్నారు. దీంతో పాటు మండల కేంద్రంలో రోడ్డు వెడల్పులో ఇళ్లు కోల్పోయిన 56 మందికి స్థలాల పట్టాల పంపిణీ, 50 మందికి గృహలక్ష్మి, 119 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందజేయనున్నారు.



బీటీగా మారనున్న బట్టోనిపల్లితండా రోడ్డు